నిధులు లేక.. పనులు సాగక.. 6
- గ్రామ పంచాయతీల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- పాలకవర్గాలు లేక పట్టింపు కరువు

అప్రమత్తతే శ్రీరామరక్ష 7
- నిప్పును నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం

ఎట్టకేలకు మోక్షం

- కరకట్టల నిర్మాణ పనులు ప్రారంభం
- రాళ్లవాగులో మట్టి చదును
- రూ. 250 కోట్లు కేటాయింపు
- రాళ్లవాగు బ్యాక్ వాటర్‌తో తప్పనున్న ముంపు గండం



రాళ్లవాగు ఒడ్డు వెంట కరకట్టల నిర్మాణానికి చదును చేసిన స్థలం

మంచిర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో కరకట్టలు కట్టాలనే ప్రతిపాదనకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగులో కరకట్టల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభ మయ్యాయి. కరకట్టల నిర్మాణం పూర్తయితే ఇన్నేళ్లుగా ముంపు బాధలు పడుతున్న జిల్లా కేంద్రంలోని పలు కాలనీల ప్రజలకు ఆ బాధలు తప్పుతాయి. వర్షాకాలంలో రాళ్లవాగు ఉప్పొంగి ఏడెనిమిది కాలనీలు నీట మునుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న నీటిపారుదలశాఖ అధికారులు వాగుకు ఇరువైపులా కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అందజేశారు. వరద రక్షణ గోడల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు, భూసేకరణ అవసరం అవుతుండగా తలకు మించిన భారంగా భావించిన కేసీఆర్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది.

● రాళ్లవాగులో మునిగిన కాలనీలు....

భారీ వర్షాల కారణంగా గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతాలు నీట మునిగాయి. నదిలో చేరే అవకాశం లేక రాళ్ల వాగు, తోళ్లవాగుల్లో వరదనీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి, పోటు కమ్మాయి. జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో పెద్దమొత్తంలో ఇళ్లు మొదటి అంతస్థు వరకు నీట మునిగాయి. అలాగే తోళ్లవాగు నీరు కూడా నివాస గృహాల దరిదాపుల్లోకి చేరింది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు గత సంవత్సరం ఆగస్టు 22, 23 తేదీల్లో సర్వే జరిపి నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో పుట్టిన రాళ్లవాగు అటవీ ప్రాంతం గుండా ప్రవహించి జిల్లా కేంద్రానికి చేరుకుంటుంది. స్థానిక ఆర్‌ఆర్ నగర్, కార్మెల్ హైస్కూల్, గౌతమీనగర్, రెడ్డి కాలనీ, పాత మంచిర్యాల, రాంనగర్, ఎన్టీఆర్ కాలనీల మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. గత జూలైలో కురిసిన వర్షాల కారణంగా రాళ్లవాగులో 139.20 మీటర్ల ఎత్తున నీరు ప్రవహించినట్లు అధికారులు గుర్తించారు. పాత మంచిర్యాల వంతెన వద్ద 48006.35 క్యూసెక్కుల నీరు వాగు గుండా ప్రవహించినట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే తోళ్లవాగుపై ఉన్న చింతల చెరువు నుంచి వరద తాకిడి పెరగడంతో నివాస గృహా ల్లోకి నీరు చేరింది.

● రూ. 234.86 కోట్ల అంచనాతో...

మంచిర్యాల పట్టణంలోని రాళ్లవాగుకు కరకట్టల నిర్మాణం చేపట్ట డం ద్వారా వరదను నివారించడానికి పట్టణంలోని కార్మెల్ స్కూల్ బ్రిడ్జి నుంచి 5.7 కిలోమీటర్ల పొడవున 140 మీటర్ల ఎత్తుతో ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని..

మిగతా 7లో

రెండు సంవత్సరాలుగా ముంపు....

వరుసగా రెండు సంవత్సరాలుగా జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలో జనజీవనం అతలాకుతలం అవుతోంది. 2022 జూలై 13న కుండపోతగా వర్షం కురవడంతో జిల్లా కేంద్రంలోని వాగులు పొంగిపొర్లి గోదావరి ఉప్పొంగింది. వాగుల్లో నీరు ఎదురెక్కి గృహాల్లోకి చేరింది. అర్ధరాత్రి ఒక్కసారిగా వరదలు రావడంతో ప్రజలు తేరుకొనేలోపే కాలనీలు నీట మునిగాయి. భారీ వరదల కారణంగా ఏడెనిమిది కాలనీలు 48 గంటల పాటు నీటిలోనే మగ్గాయి. తిరిగి గత సంవత్సరం జూలైలో కురిసిన వర్షాలకు మళ్లీ ఆయా కాలనీలు నీట మునిగాయి. దీంతో ముందస్తుగా ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న అధికార యంత్రాంగం పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బానోత్ ప్రసాద్

మందమర్రిరూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ సాగు పద్ధతులపై వ్యవసాయాధికారుల సూచనల పాటిస్తూ ముందుకు సాగాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని సండ్రోన్‌పల్లి గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారులు సూచనలు పాటించాలని అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి పథకంలో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. పంట మార్పిడిలకు రైతులు ముందుకు రావాలని అప్పుడే లాభాలు సాధించవచ్చని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు ఉంటాయన్నారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు ఐలయ్య, రాజిరెడ్డి, లింగారెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం నాయకుల అరెస్టు

కోటపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ బాపునాయక్‌తో పాటు రఘును బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బంజారాలకు మంత్రి పదవీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన వీరిని పోలీసులు అరెస్టు చేశారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

మంచిర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లే అవుట్ అనుమతుల్లేని ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం తెరపైకి తెచ్చి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గత నెల 31 వరకు ఎల్ఎఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధిత ఫీజులో 25 శాతం రాయితీ కూడా కల్పించింది. అయితే గడువు ముగిసే నాటికి ప్రభుత్వం ఊహించిన విధంగా దరఖాస్తులు రాకపోవడంతో గడువు పెంచాలనే నిర్ణయానికి వచ్చింది. దీంతో 25 శాతం రాయితీతో కూడిన ఎల్ఆర్ఎస్ గడువును ఈనెల 30 వరకు పెంచుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ బుధవారం జీవో నంబర్ 182 జారీ చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల వేలాన్ని ఆపాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యుఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ప్రజాపాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం గురించి పోరాడుతున్న వారి గొంతుకలపై కత్తులు పెట్టి అణిచివేత ప్రయత్నాలు చేస్తోందన్నారు. యువత, విద్యా ర్థుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరిట ప్రకృతిని నాశనం చేస్తోందన్నారు. వెంటనే వేలం పాటను వెనక్కి తీసుకోవాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సన్నిగౌడ్, సుమన్, తిరుపతి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్వేత

భీమారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉడాలని భీమారం ఎస్ఐ శ్వేత సూచించారు. బుధవారం భీమారంలోని కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇంటి వద్ద మొబైల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారు డిప్రెషన్‌లోకి వెళ్లవద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినాలని, ప్రేమ, ఆకర్షణలకు దూరంగా ఉండాలన్నారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 5, 14 తేదీల్లో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణపై గురువారం ఉదయం 10గంటలకు సమీకృత కలెక్టరేట్‌లోని ఎఫ్-3లో గల జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాల నిర్వహణకోసం వివిధ దళితసంఘాల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

కోటపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూలు జిల్లా ఊరుకొండలో మహిళను గ్యాంగ్‌రేప్ చేసిన నిందితులను కఠనంగా శిక్షించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చెన్నూరి రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళ స్నేహితున్ని చెట్టుకు కట్టేసి మద్యం మత్తులో ఉన్న 8మంది యువకులు మహిళపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. లైంగికి దాడికి పాల్పడిన క్రూర మృగాలను సమాజం నుంచి వెలివేయాలని అవసరమైతే వారికి మరణ శిక్ష విధించాలని ఆయన కోరారు. బాధితురాలుకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సప్ప మహేష్, సుందిల్ల అశోక్, రాజేష్, రవికుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



దండేపల్లి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



నెన్నెలలో...

మంచిర్యాల క్రైమ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. జిల్లాలో మొత్తం 9,190మంది విద్యార్థులకుగాను 9175మంది విద్యార్థులు హాజరయ్యారు. 99.5శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

దండేపల్లి/నెన్నెల/కాసిపేట: దండేపల్లి, నెన్నెల, కాసిపేట మండలాల్లో పదోతరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. పరీక్ష కేంద్రం నుంచి బయటికి వచ్చాక మనసు తేలికపడి గాల్లో తేలినట్టు అనుభూతి చెందారు. స్నేహితులను వీడుతున్నామనే ఒకింత బాధ ఉన్నప్పటికి మళ్లీ కలుస్తామనే భరోసాతో ఇంటి బాట పట్టారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

జన్నారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఢిల్లీలో నిర్వహిస్తున్న బీసీపోరుగర్జన సభకు మద్దతుగా బుధవారం బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు జన్నారం మండల తహసీల్దార్ రాజవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కోడూరి చంద్రయ్య, మూల భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, శంకర్, రవి, శ్రీనివాస్, మహేష్, వేణు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు చేయొద్దు.. భవిష్యత్తు పాడు చేసుకోవద్దు

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైమ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నేరాలు చేసి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని మంచిర్యాల డీసీపీ భాస్కర్ యువతకు సూచించారు. మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం కాలనీ వాసులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ మాట్లాడుతూ యువతపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మద్యం, గంజాయికి అలవాటు పడినవారు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతుంటారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ రాత్రి 10గంటలలోపు ఇంటికి చేరుకునేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఒకసారి ఏదైన కేసులో ఇరుక్కుని జైలు పాలైతే వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయం గమనించి తమ పిల్లలను క్రమశిక్షణతో పాటు సత్ప్రవర్తనతో ఉండేలా చూడాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

దండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి గుడికి రేకుల షెడ్డు నిర్మాణానికి ఆదే గ్రామానికి చెందిన బండారి రామదాసు-లక్ష్మి దంపతులు రూ. 1లక్ష 20వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. బండారి రాజవ్వ-లచ్చయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



లక్షెట్టిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ విలువలను ప్రజలకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించామ న్నారు. మహనీయుల చిత్రపటాలను ప్రజలకు చూపుతూ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాలతో పాటు దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట, నస్పూర్ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణ మనందరి ధ్యేయమని నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సర్మిళ్ల వేణు అన్నారు. శ్రీరాంపూర్‌లో 'జై బాపు... జై భీమ్.. జై సంవిధాన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుగూడ నుంచి తాళ్లపేట మీదుగా లింగాపూర్ వరకు కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. బుధవారం హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి జై బాపు జై భీం జైసంవిధాన్ పాదయాత్రను ప్రోగామ్ కోఆర్డినేటర్ ఇంచార్జి రామగిరి భానేష్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, నవీన్, కమలాకర్, మోహన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరికొంగ నవీన్, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు జైబాపు, జైభీం, జైసంవిధాన్ అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చిట్ల సత్యనారాయణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ ఆరీఫ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, మాజీ ఎంపీటీసీ మడిపల్లి స్వామి, నాయకులు గెత్తికొండ శ్రీధర్, సయ్యద్ శాహెద్‌ఆలీ, అమీర్, నవాబ్, రాజు, రవీందర్, సుగుణాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారికి పండ్లు అందిస్తున్న బీజేపీ నాయకులు

జైపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేవైఎం, ఎంఆర్‌పీఎస్ నాయకులు, ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారని, వారికి రక్తం అవసరం ఉండడంతో ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, బీజేపీ నాయకులు రాజ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, రాంటెంకి సాయి, సుమన్, వంశీగౌడ్, రామగిరి రాము ,రెడ్‌క్రాస్‌సొసైటి నిర్వహకులు కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వృత్తి విద్యా ట్రైనింగ్ (ST) లకు

భారత ప్రభుత్వ ట్రైబల్ సంస్థ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో సాయిని ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా


PRABHA VOCATIONAL TRAINING CENTER,

H.No. 3-61/1A, Mulkala, Mancherial District తెలంగాణ రాష్ట్రంలో ఉచిత వృత్తి విద్యా ట్రైనింగ్ గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు 1సం॥కాలపరిమితితో నడుపుటకు నిర్ణయించితిమి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోగలరు. అమ్మాయిలకు - 80%, అబ్బాయిలకు -20% సీట్లు కేటాయించడమైనది.

చివరి తేది : 16-04-2025

కోర్సులు : టైలరింగ్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, బ్యూటీషియన్ (గర్ల్స్ మాత్రమే), జి.డి.ఎ (గర్ల్స్ మాత్రమే), వెల్డింగ్-(అబ్బాయిలకు మాత్రమే)



B.V. Rao
Chairman

SAINI EDUCATIONAL SOCIETY, KARIMNAGAR
Cell : 70328 59724

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి

అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి **చందాదారులు** గా చేరాలనుకుంటున్నారా!

అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.

పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు

మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం
మంచిర్యాల వాసి మృతి

మంచిర్యాల క్రైమ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త బుధవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెలితే మంచిర్యాల పట్టణం రాంనగర్‌కు చెందిన అందె విజయ్(53) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి మంచిర్యాలకు తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న కారును ఔటర్ రింగ్‌రోడ్డుపై లారీ వెనుకాల నుంచి ఢీకొట్టడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న పలువురికి గాయాలైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మంగ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక కూతురు దిశ అమెరికాకు ఉన్నత చదువుల కోసం వెళ్లగా మరో కూతురు హైదరాబాద్‌లో చదువుతున్నట్లు సమాచారం, మృతుడి భార్య మంగ ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. విజయ్ మృతిపై సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేత

కెరమెరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని బుధవారం ఎంపీడీవో అంజద్‌పాషాకు తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు ఆనంద్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 19 తరువాత నివరధిక సమ్మె చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, అనీల్, నగేష్, వెంకటి, మల్లేష్, శ్రీనివాస్, భుజంగ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని బుధవారం ఎంపీడీవోకు తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

వాంకిడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని చౌపన్‌గూడ నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై తీసుకుంటున్న చర్యలను కార్యదర్శిని అడిగి తెలుసుకన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీరు పోయాలన్నారు. మొక్కలు ఎండి పోకుండా గ్రీన్‌షెడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. హరితహారంలో లక్ష్యం మేరకు నాంటేందుకు మొక్కలు సిద్ధం చేయాలని సూచించాచు.

నిధులు లేక.. పనులు సాగక..

- గ్రామ పంచాయతీల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- పాలకవర్గాలు లేక పట్టింపు కరువు

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొద్ది నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయక పోవడంతో పల్లెల్లో అభివృద్ధి కంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం పారిశుద్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. కానీ నిధులు లేక పోవడంతో నిస్తేజం ఆవరిస్తోంది. కనీసం మౌలిక సదుపాయాలకు సరిపడా డబ్బులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి



పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

సుమారు 14 నెలలు కావస్తోంది. అప్పటి నుంచి ప్రత్యేకాధికా రుల పాలన కొనసాగుతోంది. గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్, పారిశుధ్యం, బోరింగుల మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్, వీధి దీపాల ఏర్పాటు తదితర చిన్న చిన్న పనులు నిర్వహ ణ కూడా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పూర్తి కావడం లేదు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్యదర్శులే సొంత డబ్బులు వెచ్చిస్తూ పనులు కొనసాగించాల్సి వస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో 335 పంచాయతీలు..

జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల ఉన్నాయి. వీటి నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయి. సర్పంచ్‌ల కాలం ముగియడంతో పాటు ఇప్పటి వరకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉంటున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో జనరల్ నిదులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉందని గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే నామ మాత్రంగా నిధులు విడుదల కావడం, అవి ఎటు సరిపోకపోవడంతో చాల గ్రామ పంచాయతీల్లో తిప్పలు తప్పడం లేదు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 127 ఎంపిటీసి స్థానాలు, 15 జడ్పీటీసి స్థానాలు, 2067 వార్డు సభ్యుల సంఖ్య ఉంది. ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో పల్లె పాలన గాడి తప్పతోంది.

పలు మేజర్ గ్రామ పంచాయతీ ల్లోనైతే ఇబ్బందులు ఎక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో జనాభా పరంగా ఎక్కువగా ఉంటాయి. దీంతో ఒక్కో గ్రామ పంచాయతీకి



ఏడాదికి సుమారు రూ. 4 లక్షల వరకు నిర్వహణ ఖర్చులు చేయాల్సి ఉంటుంది. చిన్న గ్రామ పంచాయతీల్లో 2 నుంచి 3 లక్షల వరకు నిర్వహణ ఖర్చు చేయాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాక గ్రామీణ ప్రాంతాల్లో పనులు పూర్తి కాకపోవడంతో ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. సర్పంచ్‌లుగా ఉంటే అన్ని విధాలుగా గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలు చూసుకునేవారు. గత ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పాలన గాడి తప్పడంతో అత్యవసర పనులకు కూడా ఆటంకంగా మారింది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులే చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేసి పల్లెల అభివృద్ధికి ఆటంకం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

రమేశ్, జైనూర్ సీఐ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: జైనూరు సర్కిల్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీఐ: జైనూరు సర్కిల్ పరిధిలోని లింగాపూర్, జైనూరు, సిర్పూర్ (యు) మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. జన సమూహం, బస్టాండ్ కూడలీలో సిబ్బందికి విధు లు కేటాయిస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడంతో పాటు సమస్యలు ఏర్పడకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సభలు సమావేశాల నిర్వాహణ కోసం ఎలా అనుమతి పొందాలి?

సీఐ: జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నది. ఒక వేళ అనుమతి కావాలంటే డీఎస్పీ, ఎస్పీకి అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకోవాలి. ఉన్నతాధికారులు అనుమతి ఇస్తేనే సభలు, సమావేశాలు నిర్వహించుకునే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: జైనూరు సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారులు లైసెన్సులు తీసుకోవాలని సూచిస్తున్నాం. లైసెన్స్ లేక పోవడం వల్ల తలెత్తే ఇబ్బందులను వివరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జైనూరులో వార సంత రోజు ట్రాఫిక్ ఇబ్బదులు ఏర్పడుతున్నాయి. దీని కోసం తీసుకుంటున్న చర్యలు ఏంటి?

సీఐ: వారసంత రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. పూర్తిగా రోడ్లుపైనే సామగ్రి అమ్మకాలు జరుపకుడాదని వ్యాపారులకు సూచిస్తున్నాం. సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలు క్రమపద్ధతిలో పెట్టుకునేలా చూస్తున్నాం.

- జైనూర్, ఆంధ్రజ్యోతి

అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలు



గాయడిపన కిషన్

జన్నారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన చిరివేణి కిషన్ అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ఉదయం పొనకల్ గ్రామ శివారులోని పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన కిషన్‌పై ఒక్కసారిగా అడవి పంది దాడి చేసింది. భయంతో కిషన్ అరవడంతో సమీపంలో ఉన్న మరో వ్యక్తి అక్కడకు రావడంతో అడవి పంది పారిపోయింది. ఈ ఘటనలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను కింద గాయమైంది. కిషన్‌ను కుటుంబ సభ్యులు వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్టు

తాండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలోని అచ్చలాపూర్ పంచాయతీ కొమ్ముగూడెంకు చెందిన దాగం మల్లేష్ అనే వ్యక్తి మార్చి 16న మద్యం సేవించి ఇంట్లో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో భార్య లావణ్య, అత్త రాజు అడ్డుకోగా వారిని కబ్గిర గరిటెతో తలపై బలంగా కొట్టడంతో గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం మల్లేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



రవితేజ(ఫైల్)

తాండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టంపేట గ్రామపంచాయతీ తంగళ్లపల్లి గ్రామానికి చెందిన రవితేజ (23) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రవితేజ హైద్రాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల కంటికి ఆపరేషన్ కావడంతో విశ్రాంతి కోసం ఇంటి దగ్గర ఉంటున్నాడు. తన కంటి చూపు నయం అవుతుందో లేదోనసే బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో బుధవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు ఇంటికి చేరుకుని రవితేజను కిందకు దించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రవితేజ మేనమామ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల పట్టివేత



అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న నిందితులు

జైపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపెల్లి శివారులోని అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులను వేటాడి మాంసాన్ని అమ్ముతున్న ఇద్దరు నిందితులను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఆర్‌వో రత్నాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పాలమాకుల శ్రీనివాస్‌రెడ్డి, గూడ పాపన్న గ్రామ పొలాల సమీపంలో ఉచ్చులు అమర్చి రెండు కృష్ణ జింకలను వేటాడినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పారిపోయారని వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. నిందితులపై వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఎఫ్ఎస్‌వోలు రామకృష్ణసర్కార్, సతీష్, ఎఫ్‌బీవో అంజిత్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవానం కారు ఢీకొని కుర్మదాస్, వినయ్, ప్రేమ్‌దాస్ అనే ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గునిశెట్టి సంతోష్ అనే వ్యక్తి జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం కారు నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాకింగ్ చేస్తున్నారు. సంతోష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ముగ్గురు విద్యార్థులను ఢీకొట్టడంతో ఆసిఫాబాద్‌కు చెందిన కుర్మదాస్ అనే విద్యార్థికి రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ఇద్దరు విద్యా ర్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ రాధాకిషన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం'పై
అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై యువతకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లతో రాజీవ్ యువ వికాసం పథకం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఈ నెల 14 తేదీలోగా రాజీవ్ వికాస పథకం కింద దరఖాస్తు చేసుకునే విధంగా పరిషత్ కార్యా లయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాలు దరఖాస్తులు అదుబాటులో ఉంచామని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ప్రతులు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారలు ఒకే రకమైన యూనిట్ కాకుండా గ్రామాలలో ఉండే అవసరాలను బట్టి యూనిట్లను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌జ్యోషి పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి..

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, మురుకు కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పంచాయతీరాజ్ ఈఈ, డీఈఈ, ఏఈఈలతో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనుల పురోగతి ఎంబీ రికార్డులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు మంజూరైన సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



11న నిర్వాసితులకు ప్లాట్లు పంపిణీ



మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్

కాసిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దుబ్బగూడెం భూనిర్వాసితులకు ఈ నెల 11న ప్లాట్లు పంపిణీ చేయనున్నట్లు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్ అన్నారు. దుబ్బగూడెం పునరావాస కాలనీలో బుధవారంనిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కళ్యాణిఖని మెగా ఓసీపీలో దుబ్బగూడెం ముంపుకు గురైందని చెప్పారు. ఇళ్ల స్థలాలతో పాటు ప్యాకేజీని ఈ నెల 11న అందజేస్తామన్నారు. ఈ నెలాఖరులోగా విద్యుత్ సరఫరా అంతర్గత రోడ్ల నిర్మాణాలు, దేవాపూర్ టూ బెల్లంపల్లి ప్రధాన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అందరు సహకరించాలని కోరారు. సమావేశంలో సివిల్ ఇంజనీర్ రాము, ఎస్టేట్ అధికారి నవనీత, స్థానిక నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులు వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సింగరేణి వైద్యాధికారి లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. సింగరేణి ఉద్యోగులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీరాంపూర్ ఓసీపీపై అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది లీటర్ల నీరు తాగాలన్నారు. ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి తలకు టోపీ, ముఖానికి రుమాలు ధరించాలని, చేతులను కప్పి ఉంచేందుకు ఫుల్ షర్ట్ ధరించాలని అన్నారు. ఉప్పు, నిమ్మరసం కలిపిన మజ్జిగ తరచూ తీసుకోవాలన్నారు. సింగరేణి సంస్థ అందిస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉద్యోగులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఓసీపీ పీవో టి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగులు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ లాభాల బాట పడుతుందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 32 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను 35 లక్షల టన్నులు వెలికితీసి నందుకు అభినందనలు తెలిపారు. అనంతరం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోతె కొమురయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, అధికారుల సంఘం ప్రతినిధి కమ్రుద్దీన్, రక్షణాధికారి సంపత్, సర్వే అధికారి సంపత్, సంక్షేమాధికారి శంకర్ పాల్గొన్నారు.

పిల్లలు, మహిళల రక్షణకే ప్రాధాన్యం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పిల్లలు, మహిళల రక్షణకే పోలీసు శాఖ తొలి ప్రాధాన్యం ఇస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా సెంటర్ల పని చేస్తున్నాయన్నారు. విద్యార్థులను, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని చెప్పారు. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై షీ టీం, భరోసా టీం, సంబంధిత పోలీసు స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వీరితో పాటు ఉపాధి హామీ పనికి వెళ్లే మహిళలకు కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో ఏదైనా హింసకు గురైనట్లయితే షీ టీంలను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మార్చి నెలలో షీ టీం ద్వారా 74 హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించా మన్నారు. 13 అవేర్నెస్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించామని చెప్పారు. మూడు కేసులలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మూడు కేసులో ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పని చేస్తున్నాయని అన్నారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే ఆసిఫాబాద్ డివిజన్ 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ 8712670565 లేదా డయల్ 100కు సమాచారం అందించాని సూచించారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఏరియాకు మున్సిపల్ అధికారులు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఐదు రోజుల క్రితం వాటర్ ట్యాంకు వాల్వు మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు బుధవారం నూతన వాల్వును బిగించి నీటిని సరఫరా చేశారు. దీంతో ఐదు రోజులుగా కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి.

డిప్యూటీ తహసీల్దార్ సస్పెన్షన్

కౌటాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కౌటాల డిప్యూటీ తహసీల్దార్ మష్కూర్ అలీ సస్పెండ్ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ గతంలో చింతలమానేపల్లిలో పని చేస్తున్న సమయంలో అవకతవలకు పాల్పడడంతో కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. గతంలో చింతలమానేపల్లి ఫుల్ అడిషనల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న సమయంలో బాలాజీఅనుకోడ శివారులో గల 65/193/3 నీలం అశోక్ పేరిట ఉన్న ఎకరం భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా రిటైర్డ్ తహసీల్దార్ కామ్రె రావూజీ భార్య అయినటువంటి రేఖాబాయి పేరిట సక్షెషన్(విరాసత్) చేశారు. దీంతో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదికలు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ అన్నారు. మండలంలోని దొడ్డిగూడ, దాబా, సవ్వాతి, బండకాస, చిచ్చుపల్లి, నవేదరి తదితర గ్రామాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అనిల్, మెంగాజీ, జీవన్, సునీల్‌కుమార్, బాపురావు, మోతీరాం, మాలయ్య, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం రహపల్లి, ఈదులవాడ పంచాయతీల్లో బుధవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఆత్రం సక్కుల ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు జై బాపు, జైభీం, జై సంవిధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో నాయకులు చరణ్, బాలేష్‌గౌడ్, దేవాజీ, శివరాం, రమేష్, దీపక్, అసద్, సంతోష్, తిరుపతి, సంతోష్, ప్రవీణ్, కృష్ణమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం

- కరకట్టల నిర్మాణ పనులు ప్రారంభం

(5వపేజీ తరువాయి)

అలాగే గోదావరి నది ఎడమవైపు ఒడ్డున రాళ్లవాగు కలిచే చోట రెండు కిలోమీటర్ల పొడవున కూడా కరకట్ట నిర్మాణం చేపట్టవలసి ఉండగా, ఆ మేరకు నివేదిక తయారు చేశారు. ఇందు కోసం ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం సుమారు రూ. 234 కోట్ల 86 లక్షల 33 వేలు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో కరకట్టల నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు సుమారు రూ. 200 కోట్ల 86 లక్షలు వెచ్చించాల్సి రాగా, కరకట్టల నిర్మాణానికి రూ. 20 కోట్ల 21 లక్షల 31వేలు, సీవోటీ ఎక్సవేషన్, పూడిక ఖర్చు రూ. 2 కోట్ల 48 లక్షల 43 వేలు, కరకట్ట రివిట్‌మెంట్‌కు రూ. 5 కోట్ల 25 లక్షల 51 వేలు, జీఎస్టీ, సీనరేజ్ చార్జీలు, డీఎంఎఫ్టీ, ఎస్‌ఎంఎఫ్, తదితరాలకు రూ. 6 కోట్ల 91 లక్షల 44 వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. వాగు మధ్య నుంచి ఇరువైపులా 65 ఫీట్ల వెడల్పుతో కరకట్టలు నిర్మించాల్సి ఉంది. ఇదిలా ఉండగా తోళ్లవాగులో రూ. 25 లక్షల అంచనా వ్యయంతో పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా కరకట్టలు నిర్మించాల్సిన అవసరం లేకుండానే పరిస్థితిని చక్కదిద్దవచ్చునని అధికారులు ప్రతిపాదించారు.

ఎమ్మెల్యే చొరవతో....

రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా మంచిర్యాల పట్టణం నీట మునుగుతుండటంతో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కరకట్టల నిర్మాణం చేపట్టవలసిందిగా గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలనలోకి తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అధికారుల నుంచి నివేదికను తెప్పించుకుంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 250 కోట్లను కేటాయించారు. దీంతో కరకట్టల నిర్మాణానికి మార్గం సుగమం కాగా, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కరీంనగర్‌లోని మానేరు డ్యాం కరకట్టలు నిర్మించిన కాంట్రాక్టర్‌కే మంచిర్యాల పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. కరకట్టల నిర్మాణం కోసం రాళ్లవాగులో ప్రస్తుతం మట్టిని చదును చేస్తున్నారు. గరిష్ఠంగా సంవత్సరం కాలపరిమితితో కరకట్టల నిర్మాణం పూర్తి కానుండగా, జిల్లా కేంద్రంలోని ముంపు ప్రజలకు బాధలు తప్పనున్నాయి.

మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి: కలెక్టర్



దండేపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గౌడ సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించగా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంలతో కలిసి కలెక్టర్ హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్ రావు, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరి, దుర్గా ప్రసాద్, కల్పన, సంఘం నాయకులు పాల్గొన్నారు.

జన్నారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, మోకుదెబ్బ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు భరత్‌కుమార్, ఇందయ్య, చంద్రయ్యనర్సయ్య, శంకర్, సత్తన్న పాల్గొన్నారు.

దండేపల్లి(ఆంధ్రజ్యోతి): సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్ అన్నారు. దండేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, లక్ష్మీనారాయణ, రమేష్, శ్రీనివాస్, కుమారస్వామి, సత్యాగౌడ్, తిరుపతి, చంద్రగౌడ్, మల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, మడిపెల్లి వెంకటేశ్వర గౌడ్, వడ్లకొండ కనకయ్య గౌడ్, నోముల శ్రీనివాస గౌడ్, సట్ల సంతోష్, రంగు రవిందర్, బండి శంకర్ గౌడ్, బుర్ర అంజనేయులు, పోతునూరి ప్రభాకర్ గౌడ్, బండారి శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీనివాస్, కొయ్యడ కుమార్ గౌడ్, రంజిత్ గౌడ్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిలో పురుగులు

భీమిని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిగూడలో బుధవారం సరఫరా చేసిన మిషన్ భగీరథ నీటిలో పురుగులు ప్రత్యక్షమయ్యాయి. కొద్దిరోజులుగా రంగుమారిన నీళ్లు వస్తున్నాయని.. తాజాగా పురుగులు కూడా కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిలో తోక పురుగులు వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని నిబంధనల మేరకు ఫిల్టర్‌చేసి పంపిణీచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అప్రమత్తతే శ్రీరామరక్ష

- నిప్పుతో నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం
- ప్రతియేటా సగటున వంద ఇళ్లు అగ్నికి ఆహుతి
- లక్షల రూపాయల ఆస్తినష్టం

101కు సమాచారం ఇవ్వాలి

రమేష్‌బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, మంచిర్యాల



అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించి మంటలను ఆర్పేందుకు వెళ్లవద్దు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కరెంటు మెయిన్ స్విచ్ ఆఫ్‌చేసి, గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకురావాలి. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సానికులు అగ్నిమాపక సిబ్బందికి సహకరించాలి. అప్పుడే ప్రమాద తీవ్రతను తగ్గించుకోవడం వీలవుతుంది.

ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుంది

పి. హరికృష్ణ, ఆర్డీవో, బెల్లంపల్లి



అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహిస్తారు. తక్షణ సహాయం కింద బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేసి భరోసా కల్పిస్తారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఇంటిస్థితిని బట్టి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుంది.

కాసిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలతో సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. వేసవిలో మనుషులు చేసే చిన్న నిర్లక్ష్యం అజాగ్రత్త వల్ల తరుచూ ఎక్కడో ఓచోట అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. పల్లెల్లో యేటా వందకు పైగా ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతుండగా లక్షల రూపాయల ఆస్తినష్టం జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. పల్లెల్లోని రైతులు గడ్డి వాములను నివాస గృహాలకు అతి సమీపంలో ఏర్పాటు చేసుకోవడం, ఇంటి బయట పొయ్యిలను ఆర్పకుండా వదిలివేయడం, కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా నిర్లక్ష్యంగా పడేయడం, వంట గదిలో గ్యాస్ సిలిండర్‌కు పగిలి పోయిన పైపులను వాడడం, ఇళ్లలో నాసిరకం కరెంటు వైర్లు వాడుతుండడంతో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇళ్లు, వంటగది, పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్, పరిశ్రమల్లో ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ప్రతీఒక్కరు అప్రమత్తతతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలను ఉపయోగించాలి.
- వంటింటికి గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- అగ్ని నిరోధక స్వభావంగల వస్తువులతో వంటిళ్లను నిర్మించుకోవాలి.
- మనిషికి నిప్పు అంటుకున్నప్పుడు పరిగెత్తవద్దు. నేలపై దొర్లాలి లేదా దుప్పటి ఎవరైనా కప్పాలి.
- అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు గది అంతా పొగతో నిండి ఉంటుంది. మనుషులు ఎవరైనా మోకాళ్లు, మోచేతులతో పాకాలి. నోటికి అడ్డంగా తడి గుడ్డను ఉంచుకోవాలి. దీంతో కార్బన్ డైయాక్సైడ్ నోటిలోకి వెళ్లకుండా నివారించవచ్చు.
- ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ముందుగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి మంటలను పొడి ఇసుకను పోయాలి.

చేయకూడనివి...

- చిన్న పిల్లలకు అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే స్వభావం ఉన్న వస్తువులను అందుబాటులో ఉంచరాదు.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలు ఆర్పకుండా పడేయవద్దు.
- బెడ్, మంచంపై పడుకుని సిగరెట్లు, బీడీలు తాగవద్దు.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు బయటకు వెళితే గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. అలాగే విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. వంట గదిలో గ్యాస్ సిలిండర్ వాసన వచ్చినప్పుడు కరెంటు స్విచ్‌లను ఆన్ ఆఫ్ చేయవద్దు.
- అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్‌లో అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి సరిపడా నీటిని, ఫిక్స్‌డ్ ఫైర్ ఫైటింగ్‌లను నిబంధనల మేరకు అందుబాటులో ఉంచుకోవాలి.
- మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోలు, అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచవద్దు.
- కాలిన శరీర భాగాల మీద చల్లని నీరు పోయవద్దు.
- నివాస గృహాలకు గడ్డి వాములను కనీసం 60 అడుగుల దూరంలో ఉంచాలి.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

దండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరు ఏకగ్రతతో చదివితేనే వారికి మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నతస్థానంలో నిలవాలని డాక్టర్ కవిత సూచించారు. దండేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో బుధవారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతను ఏవిధంగా పెంచుకోవాలి, జీవితంలో ఏవిధంగా అత్యున్నత స్థానానికి చేరుకోవాలని అనే అంశాలపై అవగాహన కల్పించామన్నారు. జీవితంలో పైకి రావాలంటే మానసికంగా శారీరకంగా ఏవిధంగా ధృడంగా ఉండాలనే అంశాలపై విద్యార్థులకు వివరించామన్నారు. విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. విద్యార్థులు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన రాకుండా ఉండాలంటే ఏమి చేయాలనే విషయాల ను వికరించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

కన్నెపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని ప్రారంభించారు. కన్నెపల్లి మండల కేంద్రంతో పాటు జన్కాపూర్, జజ్జరవెల్లి, టేకులపల్లి, వీరాపూర్, ముత్తాపూర్, నాయకునిపేట, మెట్‌పల్లి, లింగాల గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అంకూస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి, మాజీ సర్పంచు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లి (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి, నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట, దస్నాపూర్, సుంపుటం, జిల్లెడ, లక్ష్మీపూర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సాబీర్ ఆలీ, ముల్కల సత్యనారాయణ, గాలి మధు, ఒడిల రాజన్న, తోకల రాంచందర్, పూర్ణచంద్రరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.



కన్నెపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బికర్ణ దాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 రేషన్ షాపులు ఉండగా కొత్తపల్లి గ్రామంలోని రేషన్ మినహా 12 రేషన్ షాపుల్లో బుధవారం సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైందని తహసీల్దార్ సదానందం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ అంజమ్మ, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పోడేటి రవి, మాజీ సర్పంచు గడ్డె రాంరెడ్డి పాల్గొన్నారు.

గుడ్ గవర్నెన్స్ యాత్రలో మంచిర్యాల వాసి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ లీడర్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన గుడ్ గవర్నెన్స్ యాత్రలో మంచిర్యాలకు చెందిన పెండెం సుమంత్ పాల్గొన్నారు. 9 రోజుల పాటు ఉత్తరప్రదేశ్ పరిపాలన, శాంతి భద్రతలపై అధ్యయనం, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కలిసి పలు విషయాలను తెలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్ 1 ట్రిలియన్ ఎకానమీ, పోలీసు పరిపాలన, కుంభమేళా నిర్వహణ అంశాలపై సమావేశాలు జరిపి యాత్రను పూర్తి చేశాడు. కాగా సుమంత్ హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి, ఏబీవీపీ ఆలిండియా సౌత్ జోన్ కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈసందర్భంగా కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, సుమంత్‌ను అభినందించారు.

ఘనంగా జాతీయ ఈఎంటీ దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 108 జిల్లా కార్యాలయంలో బుధవారం జాతీయ ఈఎంటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా కార్యనిర్వహణ అధికారి సంపత్ కేక్ కట్ చేశారు. ఎవరికి ఏ ఆపద వచ్చిన 108 కు ఫోన్‌చేస్తే వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ వాహన సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన నివాళి

దండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ఉపాధ్యాయురాలు రమాబిందు గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజూ తెరుచుకోని రేషన్ షాపులు

కాసిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కానీ స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందుబాటులో లేరని బియ్యం పంపిణీని రేషన్ డీలర్లు అర్థాంతరంగా నిలిపివేశారు. నెల రోజులుగా ఉగాది నుంచి పేదలకు సర్కారు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని చేసిన ప్రచారం ఇక్కడ తిరగబడింది. మంగళవారం రేషన్ షాపుల ముందు బారులు తీరిన లబ్ధిదారులు బుధవారం రేషన్ షాపుల వద్దకు భారీగా వచ్చారు. బియ్యం పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు స్థానిక నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా సన్నబియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దరఖాస్తులు కార్యాలయంలో అందించాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ప్రజలు రాజీవ్ యువ వికాసం పథకం కోసం మీసేవాల్లో చేసుకున్న దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందించాలని మున్సిపల్ కమీషనర్ మారుతీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల, నివాస, ఆదాయ, ఆధార్, రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు రెండు ఫొటోలు అందజేయాలన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

భీమారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఇప్పటి వరకు ఈ పథకం కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు. 80 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కార్యాలయం, పంచాయతీల రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థినిలకు పై తరగతులకు సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, నర్సరీని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులు ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

జైపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎండనుంచి ఉపశమనం పొందడం కోసం కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని ఐకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలో పనిచేసే కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం రవికుమార్, సేఫ్టీ అధికారి సతీష్, సంక్షేమాధికారి రమేష్ నాయక్ పాల్గొన్నారు.

నెన్నెల సీసీ శ్రీనివాస్‌కు ప్రతిభా పురస్కారం

నెన్నెల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నెన్నెల మండల సమాఖ్యలో సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ)గా విధులు నిర్వహిస్తున్న నరేందుల శ్రీనివాస్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం దక్కింది. మంచిర్యాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, స్త్రీనిధి ఆర్ఎం రమణ చేతుల మీదుగా శ్రీనివాస్ పురస్కారం అందుకున్నారు. వంద శాతం స్త్రీనిధి రుణాల రికవరీ చేసి మండల సమాఖ్యను జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిపినందుకుగాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. జిల్లా సమాఖ్య, జిల్లా అధికారులు శ్రీనివాస్‌ను ఘణంగా సన్మానించారు. నెన్నెల భీమిని ఏపీఎంలు విజయలక్ష్మి, పంజాల ప్రకాష్‌గౌడ్ అభినందించారు.

నియామకం



బింగి సదానందం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాంపూర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన బింగి సదానందం నియామకం అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రాజు శ్రీరాంపూర్‌లో సదానందంనకు నియామకపత్రం అందించారు. సదానందం అంబేద్కర్ భావజాలంతో అభ్యుదయవాదిగా, యువజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఎం కమలాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. యువజన విభాగం పటిష్టతకు కృషి చేస్తానని సదానందం పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేకపోతున్న ప్రతిపక్షాలు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్ష పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వీటిని సక్రమంగా అమలు చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఆదేశాలతో రోజుకో డీలర్ షాపును సందర్శిస్తున్నామన్నారు. పదేళ్ల పాలనలో ఖజానా ఖాళీ చేసి ఆర్థిక విధ్వంసం చేసిన బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజలే బాస్‌లు అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మానుకుంటే మంచిదని, లేనిపక్షంలో ప్రజలే బుది చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భీమిని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శారద మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల కేరింతలు, హంగామాలతో పాఠశాల ప్రాంగణం మారుమోగింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో మంచిర్యాలలోని లక్ష్మీనగర్‌లో గల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. 8వ తరగతి విద్యార్థి హర్షిత్‌రావు మొదటి ర్యాంకు సాధించి ట్యాబ్‌ను బహుమతిగా అందుకున్నాడు. అలాగే అక్షిత, విద్యాశ్రీ, సందీప్ ఖన్నా, సంయుక్త ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విద్యార్థులను బుధవారం పాఠశాల ఏజీఎం అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆయూబ్, కో ఆర్డినేటర్ నాగరాజు, డీన్ ప్రియాంక అభినందించారు.

హనుమాన్ దీక్షాపరుల సందడి

దండేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలోని అంజనేయస్వామి మందిరంలో బుధవారం పెద్దఎత్తున హనుమాన్ భక్తులు దీక్ష మాలధారణ స్వీకరించారు. సుమారు 573 పైగా మంది భక్తులు తరలివచ్చి హనుమాన్ మాలధారణ స్వీకరించారు. హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అనంతరం సత్యనారాయణ స్వామి, అయ్యప్ప, సాయిబాబ, పంచముఖి ఆంజనేయస్వాములను దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కెరమెరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుమ=రం భీం పోరాటాల ఆశయ సాధకుడు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) వ్యవస్థాపకులు, ఆదివారం ఉద్యమ కెరటం కొరెంగ గోవింద్‌రావు కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో మునీర్ అహ్మద్, నానేష్, భీంరావు పాల్గొన్నారు.

కనర్‌గాంలో వైద్య శిబిరం

వాంకిడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం కనర్‌గాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్న పిల్లలకు అందుతున్న వ్యాధి నిరోధక టీకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా తప్పకుండా పిల్లలు, గర్భిణులు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, రత్నమాల, సుమలత, భగవన్‌దాస్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

సిర్పూర్(టి), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లోనవెల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఝాన్సీ ఇటీవల ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముజకీర్ అహ్మద్, జమున పాల్గొన్నారు.

విత్తన భారం

- ఏటా పెరుగుతున్న 475 గ్రాముల పత్తి ప్యాకెట్ ధర
- గతేడాది కంటే ఒక్కో ప్యాకెట్‌పై రూ.37 పెంపు
- జిల్లా రైతులపై రూ. 2 కోట్ల అదనపు భారం

అసలే పెట్టుబడులు పెరిగి రైతులు ఆందోళన చెం దుతుంటే పెరిగిన పత్తి విత్తనం ధరలు మరింత భా రం మోపుతున్నాయి. ఈ ఏడాది పత్తి విత్తన ప్యాకెట్‌పై రూ.37 చొప్పున పెంచారు.



విత్తనాలు పెడుతున్న రైతులు(ఫైల్)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులపై విత్తన భారం ఏటా పెరుగుతూనే ఉంది. అటు కేంద్ర ప్రభుత్వం నుంచి గాని ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గాని సబ్సిడీ లేక పోవడం ప్రైవేటు విత్తన కంపెనీలు డీలర్ల నుంచి కొనుగోలు చేసి రావడం రైతులకు శాపంగా మారింది. తాజాగా 2025-26 సంవత్సరానికి బీజీ-2 పత్తి విత్తన ప్యాకెట్ (475 గ్రాములు) ధరను రూ. 901గా నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయశాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది ఒక్క ప్యాకెట్ ధర రూ. 864 ఉంది. ఈ ఏడాది రూ. 37 అదనంగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో పత్తి రైతులకు గతేడాదితో పోలిస్తే రూ. 2 కోట్లకు పైన అదనంగా భారం పడనున్నది.

● ప్రధాన పంటగా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో రైతులు ప్రధాన పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో సాగునీటి వసతులు లేక పోవడంతో వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు. ఈ కారణంతోను ఏటా పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గత వానకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3.5 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఈ ఏడాది కూడ ఇంచుమించు అంతే ఎకరాల్లో పత్తిపంటను సాగుచేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున విత్తనాలు అవసరం పడతాయి. జిల్లాలో 7 లక్షల పైననే పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం పడతాయి. విత్తనాలు విత్తిన తర్వాత మొలకెత్తక పోవడం వర్షాలు రాక విత్తనాలు మురిగిపోయిన సందర్భాల్లో ఎకరానికి మూ డు ప్యాకెట్ల చొప్పున విత్తనాలు అవసరం పడతాయి.

● కేంద్ర ప్రభుత్వం నిర్ణయం..

పత్తి విత్తనాల ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పత్తి విత్తనాల ధరలు పెం చడంతో రైతులపై అదనంగా ఆర్థిక భారం పడనుంది. గతేడాది రూ. 864 ఉండగా తాజాగా ప్యాకెట్‌పై రూ. 37 పెంచి రూ. 901గా ధర నిర్ణయించింది. జిల్లాలో 3.5 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగవు తుండగా ఏటా ఏడు లక్షల ప్యాకెట్లు అవసరం పడతా యి. దీని ద్వారా జిల్లాలోని రైతాంగానికి రూ.2 కోట్లకు పైన అదనపు భారం పడనుంది. ఏటా పత్తి విత్తనాల ధరలు పెరుగు తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అసలే దిగుబడులు లేవు..



- బాబురావు, రైతు

ఓ వైపు ఏటేటా పత్తి పంట దిగుబడులు తగ్గుతు న్నాయి. మరో వైపు విత్తనాల ధరలు పెంచుతూ పోతే రైతులకు ఆర్థికంగా భారం కానుంది. గతేడాది కంటే ఈసారి ప్యాకెట్‌పై 37 రూ పాయలు పెంచారు. గతే డాది వర్షాలు సకాలంలో సరిపడా కురువక పోవడంతో రెండు సార్లు విత్తనాలు పెట్టాల్సి వచ్చింది. దీని వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పత్తి రైతును ఆదుకునేందుకు విత్తనాలను సబ్సి డీపై అందజేయాలి.

సన్న బియ్యంతో పేదలకు మేలు



కెరమెరిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సిర్పూర్(టి)లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

రెబ్బెన, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్న బియ్యం పంపిణీతో మేలు జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో బుధవారం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పానకంటి రాంమోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్‌పల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర శ్రద్ధా శుక్లా ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై కొముర య్య, కార్యదర్శి శ్రీధర్, డీలర్ బాపురావు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటి దశల వారిగా పూర్తి చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో లాంచనంగా సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈఓ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు. కాగా టోంకిని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బాలాజీ అనుకోడ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ ప్రారం భించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో సుధాకర్, నానయ్య, శేఖర్, మారుతి పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): పలుగుపల్లి, కుశ్నపల్లి, బెజ్జూరు గ్రామల్లో సన్న బియ్యం పంపిణీని ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, వ్యవసాయ అధికారి నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, నాయకులు పుష్పలత, శ్రీవర్ధర్, హర్షద్‌హుస్సేన్, జగ్గాగౌడ్, నాహీర్ అలీ, పెంటన్న, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ దత్తారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, మాజీ ఎంపీపీలు నానయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి కోటారి, ఝరి గ్రామాల్లో ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డీటీ శ్రావణ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో గిర్దావర్ మాజీద్, పెంటు, సుధాకర్, దీపక్ ముండె పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పథకాన్ని జైనూరులో ప్రారం భించారు. కాసుపటేల్‌గూడలోని డీఆర్‌డిపోలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పంచాయతీ ప్రత్యేక అధికారి జాదవ్ గుణ్వంత్‌రావు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో సెల్స్‌మెన్ జాదవ్‌గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పంగడిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణారావు, ఎస్సై రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): కోత్మీర్, బోర్లకుంట, ఇట్యాల గ్రామాల్లో ఎంపీడీవో రాజేందర్ సన్న బియ్యం పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగభూ షణం, డీలర్లు శ్రీనివాస్, పార్వతి, జనార్దన్ కార్యదర్శులు సౌమ్య, సాయి, వంశీ, మధుకర్, మురారీ, సోను తదితరులు పాల్గొన్నారు.

తైబజారు రుసుం వసూలు చేయొద్దు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో తైబజారు రుసుం వసూలు నిలిపివేయాలని బుధవారం చిరు వ్యాపారులు, రైతులు మార్కెట్ బంద్ నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ నుంచి కొనసాగిన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ గాంధీ చౌరస్తా మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే కోనప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరువ్యాపారులకు తైబజారు రుసుము వసూలు వేయకుండా గతంలో తాను కృషి చేశానని అన్నారు. సిర్పూరు నియోజకవర్గంలో తనతో కలుపుకొని నలుగురు నాయకులు ఉన్నారని అన్నారు. పేదలకు ఇబ్బందులు కలుగకుండా ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి తైబజారు రుసుం చెల్లించాలని సూచించారు. లేకుంటే తైబజారు టెండర్లు రద్దు చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు అందజేశారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావుతో పాటు ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మార్కెట్‌కమిటీ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు. డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, ఎస్సై మహేందర్, సందీప్ తదితరులు బందోబస్తు నిర్వహించారు.

నిబంధనల ప్రకారమే తైబజారు వేలం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో గత నెల 22న తైబజారు వేలం పాట ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారమే చేపట్టామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య అన్నారు. స్థానికంగా బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత నెల 22న తైబజారు టెండరు ప్రక్రియ చేపట్టామని అన్నారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి అనుమతి కూడా పొందామని తెలిపారు. తైబజారు నిబంధనల ప్రకారం ఈ నెల 1 నుంచి రుసుము చెల్లించాలని సూచించారు. అధిక రుసుం వసూలు చేస్తే రుజువుతో ఫిర్యాదు చేస్తే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహనీయులు దేశానికి అందించిన సేవలు భావితరాలకు తెలిసే విధంగా వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి హాజరై మాట్లాడారు. మహనీయుల జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా మహనీయుల జయంతి రోజున విగ్రహాల అలంకరణ, వేదికల ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో, మండల కేంద్రాల్లో జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా వ్యవరిస్తారని, అధికారి సమన్వయంతో వేడుకలు ఘనంగా నిర్వహిం చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, నాయకులు సుభాష్, తుకారాం, అశోక్, చరణ్‌దాస్, కేశవరావు, సునీల్, శ్రీనివాస్, శివరాం, సూరజ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కరీంనగర్ ఎస్సై రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య, మాతృశ్రీ, గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, బ్రౌన్‌షుగర్, కొకైన్, చెర్రీస్, తదితర మాదకద్రవ్యాలకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. జూన్ 26న ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా కరీంనగర్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించామని అన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు పాపన్నగౌడ్

● నివాళులు అర్పించిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, తదితరులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వివక్షకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహాయోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలకు అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు, గౌడ సంఘం నాయకులు, వెనకబడిన కులాల సంగాల నాయకులతో కలెక్టర్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల కోసం రాజ్యాధికార పోరాటాలు చేసిన యోధుడు, మొగలాయిల దౌర్జన్యాలకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీ యుడని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక పాపన్నగౌడ్ అని చెప్పారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సజీవన్, డీపీవో భిక్షపతి, గౌడ సంఘం నాయకులు బాలేష్‌గౌడ్, రాధాకృష్ణ, బీసీ నాయకులు రమేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోకుదెబ్బ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి శంకర్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, లచ్చగౌడ్, అశోక్‌గౌడ్, బాపగౌడ్, లచ్చగౌడ్, సత్యగౌడ్, అంజుగౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం బెజ్జూరు మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుష్పలత, ఓంప్రకాష్, హర్షద్ హుస్సేన్, జగ్గాగౌడ్, సుధాకర్‌గౌడ్, నాగభూషణంగౌడ్, సురేష్‌గౌడ్, శ్రీవర్ధన్, నాహీర్ అలీ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

- చివరి రోజు 22 మంది గైర్హాజరు
- ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు



ఆసిఫాబాద్‌లో పరీక్ష రాసి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశా యి. బుధవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. చివరి రోజు పరీక్ష హా ల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు సంతోషంతో కేరింతలు కొట్టారు. జిల్లా వ్యాప్తంగా 6,521 మంది రెగ్యులర్ విద్యార్థుల ను గాను 6,499 మంది పరీక్షలకు హాజర య్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. 26 మంది ప్రైవేటు విద్యార్థుల్లో 23 మంది హాజ రు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 36 పరీక్షా కేంద్రాలను ప్రత్యేక అధికారుల బృందం పర్యవేక్షించింది. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, వైద్యశాఖల అధికారుల సహకారంతో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని అధి కారులు చెప్పారు. విద్యార్థులకు ఎక్కడ కూడా అసౌకర్యం కలగలేదని అన్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సహ విద్యార్థులకు వీడ్కోలు చెప్పి ఇళ్లకు వెళ్లారు.

అందని మిషన్ భగీరథ నీరు

పెంచికలపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడంతో మురళిగూడ, కొండపల్లి, చెడ్వాయి తదితర గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురళిగూడలో సుమారు 25 కుటుంబాలు ఉంటాయి. దీంతో అక్కడ ఉన్న ఒక్క చేతి పంపు వద్ద గంటల తరబడి వేచి ఉంటూ నీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు మిషన్ భగీరథ నీరు సరిపడా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మురళిగూడలో బోరు నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఉపాధి హామీ పనుల పరిశీలన

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల పట్ల పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఓ బుచ్చన్న ఉన్నారు.

అంబలి పంపిణీ ప్రారంభం



అంబలి పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండు సమీపంలో నిత్యాన్నదాన సత్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. . కార్యక్రమంలో మాజీజడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోనేరు రమాదేవితో పాటు స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.